క్లుప్తంగా

పిచ్చికుక్కను మట్టుబెట్టారు

నడికూడ : మండలంలోని నార్లపూర్‌లో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ ఐదుగురిని వెంబడించి దాడి చేసిన విషయం తెలిసిందే. కాగా భయాందోళన చెందిన గ్రామస్తులు మంగళవారం పిచ్చికుక్కను మట్టుబెట్టారు.

ఎంపీడీఓ బదిలీ

నడికూడ : ఎంపీడీఓ రాజేందర్‌ప్రసాద్ బదిలీ అయ్యారు. ఇంతకాలం ఆయన విధులు నిర్వర్తించి ములుగు జిల్లాకు బదిలీ కాగా నడికూడ ఎంపీడీఓగా ఎవరూ బాధ్యతలు చేపట్టలేదు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



వేలేరు : జిల్లాస్థాయి సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ ప్రోగ్రాంలో ప్రథమ స్థానంలో నిలిచిన స్థానిక పాఠశాల విద్యార్థి పి.సాహిత్యకు జిల్లా కలెక్టర్ రూ.5వేల నగదును బహుమతిగా అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం గొరిశెట్టి రాజన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హైస్కూల్ విద్యార్థులు ఐశ్వర్య, హర్షిత్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంకు స్వాగతం పలికిన అధికారులు



దామెర : సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా మండలంలోని దుర్గంపేట సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ హోటల్‌లో మధ్యాహ్నం స్వల్ప విరామం తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆత్మకూర్ కాంగ్రెస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి గజమాలతో సత్కరించారు.

శాయంపేట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో మాందారిపేట స్టేజీ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, నాయకులు పూలుచల్లి స్వాగతం పలికారు.

నూతన కమిటీ ఎన్నిక



కమలాపూర్ : మండల కేంద్రంలో పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పాస్టర్ సిహెచ్ చంద్రప్రసాద్, కార్యదర్శిగా మరుపట్ల అబ్రహం, ఉపాధ్యక్షుడిగా ఎస్.కిష్టఫర్, సహాయ కార్యదర్శిగా ఈ.పరంజ్యోతి, కోశాధికారిగా ఎ.కార్తీక్, సహాయ కోశాధికారిగా బి.అభిషేక్, ముఖ్య సలహాదారుడిగా రెవ జన్ను రవిబాబు, సభ్యులుగా పుల్ల సుధీర్, యాకోబు, రంజిత్, దినేష్, జాషువా, జీవరత్నం, రవీందర్‌ను ఎన్నుకున్నారు.

మాజీసర్పంచ్ కుటుంబానికి పరామర్శ

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి కిశోర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరె కుల సంఘానికి కిశోర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన వెంట ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ జండా రాజేష్, జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మనపల్లి రామేశ్వర్, నాయకులు సోనాజీ, సురేందర్, కిషన్‌రావు, ప్రేమాజీ, ప్రవీణ్, రాజ్‌కుమార్, నాగేందర్ ఉన్నారు.

పొదుపు సంఘంలో సభ్యత్వం పొందాలి



ధర్మసాగర్ : పొదుపు సంఘంలో సభ్యత్వం పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని శ్రీసాయి పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు చందరాజు జయ్‌పాల్ అన్నారు. మడికొండ పరిధిలోని ముప్పారం శ్రీవిఘ్నేశ్వర సంఘ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొదుపు చేయాలనే ఉద్దేశం ఉన్నవారు సంఘంలో చేరి ఆర్థిక అవసరాలు తీర్చుకోవాలన్నారు.

అక్రమ అరెస్టు సరికాదు : బీఆర్‌ఎస్వీ



శాయంపేట : అరెస్టు అయిన విద్యార్థి సంఘం నాయకులు



దామెర : అరెస్టయిన గ్రీన్‌ఫీల్డ్ భూనిర్వాసితులు

శాయంపేట : అక్రమ అరెస్టులు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు కారణం ఏంటో చెప్పాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ, డీవైఎఫ్‌ఐ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ మంద సురేష్, ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటీ సభ్యుడు ఆకుతోట భానుప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ పర్యటన సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులను మంగళవారం తెల్లవారుజామున పోలీస్‌లు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల్లోనే విద్యార్థి సంఘాల నాయకులకు భయపడి అరెస్టు చేయిస్తుందన్నారు. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేసి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులను నిలిపివేసి ప్రజాపాలన చేయాలని హితవు పలికారు. ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టులు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. ప్రజల పక్షాన, విద్యార్థుల పక్షాన ప్రశ్నిస్తామన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ భూనిర్వాసితుల అరెస్టు

దామెర : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే భూ నిర్వాసితులను పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తు అరెస్టులు చేశారు. ముఖ్యమంత్రి పర్యటలో ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందస్తుగా అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయినవారితో బొల్లు సమ్మిరెడ్డి, పెంచాల సూర్యం, లక్కిడి చెన్నారెడ్డి, చెల్పూరి అశోక్, చెల్పూరి లక్ష్మయ్య, ఓదెల కుమారస్వామి, మడ్డి ఓదేలు, ఓదెల తిరుమలేష్, కన్నెబోయిన రఘువులు ఉన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి



నర్సంపేట : సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

నర్సంపేట : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అనంతగిరి రవి కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్స్ సమావేశంలో మల్లేశం, యువరాజు, రవి మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం సవరించి నాలుగు కోడ్‌లుగా మార్చినట్టు తెలిపారు. సమావేశంలో హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి (బీఆర్‌టీయూ అనుబంధం) కొల్లూరు లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు హనుమకొండ శ్రీధర్, కందికొండ రాజు, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు రుద్రారపు పైడయ్య, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎల్లన్న, ఏఐటీయూసీ హమాలీ నాయకుడు నాగులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సెర్ప్ సీసీ మృతి



చీర్ల సాంబరెడ్డి

ఆత్మకూరు : గుండెపోటుతో సెర్ప్ సీసీ సాంబరెడ్డి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో సెర్ప్ సీసీగా పనిచేస్తున్న పెద్దాపూర్ గ్రామానికి చెందిన చీర్ల సాంబరెడ్డి మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సాంబరెడ్డి మృతదేహానికి ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాయపర్తి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్ర శివారులోని మార్కెట్ యార్డ్ వద్ద జాతీయ రహదారిపై వరంగల్ నుంచి వస్తున్న పత్తి లారీ తొర్రూరు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న తొర్రూరుకు చెందిన చింతల ప్రవీణ్ తీవ్ర గాయాల పాలవగా లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రవీణ్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లారీడ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై వడ్డె సందీప్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించండి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

నర్సంపేట : బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన స్టడీ సర్కిల్‌కు అబ్బాస్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్‌ఐసీ, బ్యాంకింగ్, బీఎస్‌ఎన్‌ఎల్, విమానయానం, రైల్వే, బొగ్గు ఉత్పత్తి సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు పూనుకుందని మండిపడ్డారు. రైతులకు నష్టం చేసేలా పలు చట్టాలను తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించకుండా వెనుకబడిన తరగతుల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా కుట్ర చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, పట్టణ కార్యదర్శి హనుమకొండ శ్రీధర్, నాయకులు బుర్రి ఆంజనేయులు, అక్కపెల్లి సుధాకర్, పెండ్యాల సారయ్య, మొగులోజు శారద, కందికొండ రాజు, జగన్నాథం, కార్తీక్, కలకోట అనిల్, వజ్జంతి విజయ, ఫరీదా, బిట్ర స్వప్న, లక్ష్మి, సింగారపు బాబు, నర్సింహరాములు పాల్గొన్నారు.

చిరంజీవిని కలిసి భాస్కర్

పరకాల : సినీనటుడు చిరంజీవికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు అందించడం గర్వకారణంగా ఉందని చిరంజీవి అభిమాన సంఘం పరకాల మండల అధ్యక్షుడు బొచ్చు భాస్కర్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో చిరంజీవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట : హామీల అమలు కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లిన రైతులను ముళ్ల కంచెలతో అడ్డుకొని బీభత్సం సృష్టించిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ హెచ్చరించారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో కేశెట్టి సదానందం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రమేశ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించి విదేశీ పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా మూడు నల్ల చట్టాలను రూపొందించిందని విమర్శించారు. అదానీ, అంబానీలకు ఇచ్చిన రాయితీలు, సబ్సిడీలు పేద రైతులకు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా చట్టం చేయాలని ఏడాదికిపైగా రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రక ఉద్యమం చేపడితే దిగివచ్చిన ప్రభుత్వం హామీలు ఇచ్చి మూడేళ్లు గడచినా అమలు చేయడం లేదన్నారు. ఈ క్రమంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లిన రైతులపై దుర్మార్గంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ తీరును అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు. ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకుడు నాగెల్లి కొమురయ్య, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, రైతు సంఘం నాయకులు సదానందం, రమేశ్, కోటి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా కమిటీ ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి గ్రామంలో మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా కల్వల శాంత, ఉపాధ్యక్షులుగా నల్ల రజిత, లక్క కవిత, ప్రధాన కార్యదర్శిగా గిన్నె లలిత, కోశాధికారిగా కొనకటి శ్రీదేవి, కార్యదర్శిగా బోనగిరి నాగలక్ష్మి, ప్రచార కార్యదర్శిగా కొత్తపల్లి భారతి, సభ్యులుగా బుస్సాని భవాని, సాంబారి నాగలక్ష్మి, చల్ల శైలజ, కొలువుల మాధవి, ఎలగొండ పూజిత, కోరె కాముమ్మ, లక్ష్మి, కంత్రి ఈశ్వర, గిన్నె అరుణ, తుమ్మలపెల్లి రవీన ఎన్నికయ్యారు. ఈ మేరకు కార్యవర్గానికి ఎన్నిక పత్రాన్ని ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెండి సక్కుబాయి, జిల్లా నాయకురాలు కోతి మమత అందజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

చెన్నారావుపేట : ఈనెల 14న మియాపూర్‌లో తలపెట్టిన ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ ద్వితీయ వర్ధంతికి అందరూ హాజరు కావాలని నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలను మండల కేంద్రంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకుడు కేశెట్టి సదానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి మాట్లాడారు. తాండ్ర కుమార్ హైదరాబాద్‌లో గుడిసె పోరాటాలు నిర్మిస్తూ పేదల పక్షాన పోరాడినట్టు తెలిపారు. కుమార్ ఆశయ సాధనకు శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిచ్యానాయక్, సాంబయ్య, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మద్దిమేడారంలో హుండీల ఏర్పాటు

నల్లబెల్లి : మండలంలోని నాగరాజుపల్లి మద్దిమేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు హుండీలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ మహబూబాబాద్ ఇన్‌స్పెక్టర్ కవిత పర్యవేక్షణలో ఈఓ భిక్షమాచారి హుండీలకు సీల్ చేశారు. జాతరలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్‌ఐ రాజేంద్రప్రసాద్, ఆలయ కమిటీ డైరెక్టర్లు భూంపెల్లి శ్రీనివాస్, మెడిద కిరణ్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు మురహరి కిరణ్, ఆలయ పూజారులు దురిశెట్టి సమ్మయ్య, నాగరాజు పాటు తదితరులు పాల్గొన్నారు.

14న తాండ్ర కుమార్ వర్ధంతి

చెన్నారావుపేట : ఈనెల 14న హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకుడు కేశెట్టి సదానందం, మండల కార్యదర్శి జన్ను రమేశ్ తెలిపారు.మండల కేంద్రంలో వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి హాజరై మాట్లాడారు. తాండ్ర కుమార్ హైదరాబాద్‌లో గుడిసె పోరాటాలు నిర్మిస్తూ పేదల పక్షాన పోరాడినట్టు తెలిపారు. కుమార్ ఆశయ సాధనకు శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిచ్యానాయక్, సాంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో వార్షికోత్సవ పూజలు



ఖానాపురం : మండల కేంద్రంలో హనుమాన్ ఆలయంలో ఏడో వార్షికోత్సవ పూజలు మంగళవారం చేశారు. అభయ ఆంజనేయస్వామి కమిటీ, దాతల సహకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 11 రకాల పండ్లతో అభిషేకాలు, హోమం చేశారు. మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు ప్రత్యేక మొక్కులు చెల్లించారు.

బోరుబావి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి

సంగెం : మండల కేంద్రంలోని సంగమేశ్వరాలయంలో, ఆరోగ్య ఉపకేంద్రంలో, శాంతి మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో చేపట్టిన బోరుబావి నిర్మాణ పనులను ఎంపీపీ కళావతి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండల పరిషత్ నుంచి మంజూరైన రూ.3 లక్షల వ్యయంతో మూడు చోట్ల బోర్‌బావుల నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, సొసైటీ డైరెక్టర్ పులి వీరస్వామిగౌడ్, నాయకులు మెట్టుపల్లి రమేశ్, ఆగపాటి పాల్గొన్నారు.

గుండ్లసాగర్ చెరువుకు సాగునీరు విడుదల



పైపులైన్‌ద్వారా విడుదల చేసిన సాగునీరు

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ పెద్దచెరువుకు దేవాదుల పైప్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులు నీటిని విడుదల చేశారు. కొన్ని రోజులుగా సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, నాలుగైదు రోజుల్లో రైతులకు సాగునీరు ఇవ్వని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేస్తామని ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి హెచ్చరించిన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు సాగునీరు విడుదల చేశారు. దీంతో గుండ్లసాగర్ చెరువు నిండి లింక్–2 పైప్‌లైన్ ద్వారా లోక్యతండ చెరువులోకి నీరు చేరితే మండలంలోని వివిధ గ్రామాల రైతులకు సాగునీటి సమస్య పరిష్కారం కానుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రౌతు మనోహర్ సేవలు మరువలేనివి

- సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి



నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు

పరకాల : కార్మిక, కర్షక, పేదల బడుగుబలహీన వర్గాల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసిన సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ రౌతు మనోహర్ సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. రౌతు మనోహర్ 5వ వర్ధంతి సభను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. రౌతు మనోహర్ తన జీవితకాలం మొత్తాన్ని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ఉద్యమకారుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దొగ్గెల తిరుపతి, నేదునూరి రాజమౌళి, పసరగొండ మహేందర్, బొట్ల నరేష్, పక్క చిరంజీవి, రేపాల నరసింహారాములు రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీకాంత్

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించేవారని గుర్తు చేశారు. 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే ప్రయత్నాన్ని ప్రభుత్వాలు, అధికారులు చేపట్టడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు కంప్యూటర్ విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన కంప్యూటర్ విద్యనందించాలని కోరారు. నాయకులు గణేశ్, ప్రశాంత్, శశాంక్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని స్పెక్ట్రా హైస్కూల్‌లో మంగళవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఆర్‌జేడీలుగా యశ్వంత్, సచిన్, డీఈఓగా పోలు చంద్రసాయిచరణ్, డిప్యూటీ డీఈఓగా చేతన్, ఎంఈఓగా అక్షిత, ప్రిన్సిపాల్‌గా నవ్య, వైస్ ప్రిన్సిపాల్స్‌గా శ్రీచరణ్, జాహ్నవి వ్యవహరించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్‌లు జ్ఞానేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో పెద్దపట్నం



పెద్దపట్నం వేసి పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేడుకను ఘనంగా నిర్వహించారు. మాససంక్రమణ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకుడు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, శ్రీగొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత మల్లికార్జునస్వామి కల్యాణంతో పాటు ఒగ్గు పూజారులచే పెద్ద పట్నం వేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వర్‌రావు, దేవాలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, పండితులు గట్టు పురుషోత్తంశర్మ, అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పుల్వామా అమర సైనికులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : 2019 ఫిబ్రవరి 14వ తేదీన జమ్మూ కాశ్మీర్ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న సైనికుల కాన్వాయ్‌పై పుల్వామ వద్ద ఉగ్రవాదులు చేసిన దాడిలో అమరులైన 40 మంది జవాన్లుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత మాట్లాడుతూ.. ఉగ్రవాదులు మాటుపెట్టి భారత సైన్యం ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. అమరులైన జవాన్ల త్యాగాలను ఎవరు మరువొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.